క్లుప్తంగా

దరఖాస్తు గడువు పొడిగింపు

కాజీపేట అర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వరంగల్ వెస్ట్‌లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుల గడువును ఈనెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కేయూ స్టూడెంట్స్ వెల్ఫేర్ సెంటర్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా శ్రీనివాస్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్టూడెంట్స్ వెల్ఫేర్ సెంటర్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా కామర్స్ విభాగ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ శ్రీనివాస్ నియమితులయ్యారు. తిరిగి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగిస్తూ వీసీ ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నిరంజన్ శ్రీనివాస్‌ను బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

బాలికల అప్పగింత

కాజీపేట రూరల్: రాజస్థాన్ నుంచి తప్పిపోయి వచ్చిన బాలికలను వారి తల్లిదండ్రులకు కాజీపేట జీఆర్పీ పోలీసులు గురువారం అప్పగించారు. కాజీపేట జీఆర్పీ సీఐ వి.నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు బాలికలు ఇంట్లో చెప్పకుండా బయటికి వచ్చి ఈనెల 23న సికింద్రాబాద్ – కాజీపేట మధ్య ప్రయాణిస్తున్న కర్ణాటక సంపర్క్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా టీటీఈ వారిని గుర్తించి పోలీస్ కంట్రోల్‌కు సమాచారం అందించారు. దాంతో కాజీపేటకు రైలు రాగానే ఆ బాలికలను దింపి జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు అడిగి తెలుసుకుని చైల్డ్‌లైన్‌కు జీఆర్పీ పోలీసులు తరలించారు. వారి తల్లిదండ్రులను ఇక్కడికి రప్పించి అప్పగించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ హనుమకొండ ఇన్‌చార్జ్ ప్రభ, హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ ప్రసాద్ పాల్గొన్నారు.

తెలుగు స్కూల్ అసిస్టెంట్ వలసపైడికి డాక్టరేట్



విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ మార్కజీ హైస్కూల్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వలసపైడికి పాట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. తెలంగాణలోని మాల ఉపకులాల సామాజిక సాంస్కృతిక జీవితం – సాహిత్య పరిశీలన అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వలసపైడికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ హనుమంతరావు తెలిపారు. వరంగల్‌లోని గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న పర్యవేక్షణలో వలసపైడి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. వలసపైడి కవిగా ఇప్పటికే 11 పుస్తకాలు రచించారు. వాటిలో వచన కవిత్వం, గేయ కవిత్వం, నాటికలు ఉన్నాయి. వ్యాఖ్యాతగా అనేక ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ ఆయన సేవలందిస్తున్నారు. 2017లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

పరశురామ్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు బీనావేణి పరశురామ్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎలైట్ పర్‌స్పెక్టివ్స్ అండ్ లోకల్ గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూషన్స్ – ఏ స్టడీ ఇన్ కరీంనగర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పరశురామ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సీహెచ్.దినేష్‌కుమార్ పర్యవేక్షణలో పరశురామ్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్



కాజీపేట: కాజీపేట రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గురువారం సాయంత్రం గంటకుపైగా ట్రాఫిక్ స్తంభించింది. ఓ ఆర్టీసీ బస్సు సాంకేతిక లోపంతో బ్రిడ్జిపై ఆగిపోవడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని వన్ వే పద్ధతిలో ట్రాఫిక్‌ను మళ్లించినప్పటికీ వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. అనంతరం ఆర్టీసీ బస్సును అతికష్టంమీద కిందికి తరలించారు.

అనాథాశ్రమంలో ఆశ్రమం

మడికొండ: కుటుంబ కలహాలతో కాగజ్‌నగర్ నుంచి మడికొండ శివారులోని రొట్టెబండకు ఐదు రోజుల క్రితం కొక్కుల మధుకర్ వచ్చారు. స్థానికుల సమాచారం మేరకు మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ ఆదేశాలతో పోలీసు సిబ్బంది గురువారం అక్కడి చేరుకుని అతడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మధుకర్‌ను సహృదయ ఆశ్రమంలో చేర్పించారు.

మోస్తరు వర్షానికే మురుగు.. పరుగు

- నగరంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- బురద మేటలతో నడిచేందుకు పాదచారుల ఇబ్బందులు



ఈ చిత్రం వరంగల్ కాశిబుగ్గ–పోచమ్మమైదాన్ రోడ్డు. స్మార్ట్‌సిటీ కింద రూ.కోట్లు పోసి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. అసంపూర్తిగా మారిన డ్రెయినేజీ వ్యవస్థ చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరంతా రోడ్డుపై పారుతోంది. దీంతో స్థానికులు, వాహనదారులు చీదరించుకుంటున్నారు.



ఈ ఫొటోను చూడండి. ఎక్కడో కాదు. వ్యాపార, వాణిజ్య కేంద్రమైన పాత బీటుబజార్ రహదారి దుస్థితి. బుధవారం రాత్రి, గురువారం కురిసిన మోస్తరు వర్షానికే డ్రెయినేజీలు పొంగి పార్లి మురుగంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. వర్షం నీరు వెళ్లేదారి లేక బురద మేటల నడుమ బాటసారులు, వాహనదారులు, వ్యాపార, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రెయినేజీల్లో వ్యర్థాలు పేరుపోయి ముక్కుపుటలు అదిరేలా దుర్వాసన వెదజల్లుతోంది. ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ, ఆలుగడ్డతోపాటు ఇతర వ్యర్థాలు డ్రెయినేజీకి సమీపంలో పోస్తుండటంతో సమస్య మరింత జఠిలమవుతోంది.

వరంగల్ అర్బన్: నగరంలోని ప్రధాన రహదారులే కాకుండా అంతర్గత రోడ్లు, జంక్షన్ల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. అంతర్గత మురుగు కాలువ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మోస్తరు వర్షానికే మురుగు మేటలు వేసి రోడ్డు, డ్రెయినేజీల నీరు రహదారులపై పరుగులు పెడుతున్నాయి. గురువారం సాయంత్రం కురిసిన వర్షం నీరు, మురుగు నీటితో రహదారులు, డ్రెయినేజీలు అధ్వానంగా మారాయి. వరంగల్ ములుగు రోడ్డు జంక్షన్, అండర్ బ్రిడ్జి, చిన్నబ్రిడ్జి, వరంగల్ చౌరస్తా, సంతోషిమాత కాలనీ, ఎన్‌టీఆర్ నగర్, లోతుకుంట తదితర ప్రాంతాల్లో వరద నీటితోపాటు మురుగు నీరు ప్రవహిస్తోంది. నాలుగైదు గంట పాటు వరద నీళ్లు నిలిచిపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

భయపడుతున్న నగరవాసులు

వివిధ పనులు నిమిత్తం రాకపోకలు సాగిస్తున్న ప్రజలు ఈ ప్రాంతాలనుంచి వెళ్లాలంటే వణికిపోతున్నారు. దీనికితోడు చాలావరకు మ్యాన్‌హోల్స్ మూతలు తెరుచుకుని ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. వరద నిలిచిపోవడంతో మ్యాన్‌హోల్ కనిపించపోవడంతో వాహనదారులు వాటిలో పడిపోయి ప్రమాదాలబారిన పడుతున్నారు. బల్దియా అధికారులు ఇప్పటికైనా స్పందించి వరద నీరు నిలవ ఉండకుండా చూడాలని నగరవాసులు కోరుతున్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

కేయూ క్యాంపస్: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకు రాష్ట్రంలో విచ్చలవిడిగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టుకొస్తున్నాయని విమర్శించారు. వాటిని నియంత్రించడంలో విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా కొనసాగుతున్న విద్యాసంస్థలను మూసివేయాలని నాగరాజు కోరారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, కోశాధికారి పవన్, బాధ్యులు ప్రకాశ్, రాజేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్ లైట్‌తో ప్రమాదాలకు చెక్



సిగ్నల్ లైట్ పాయింట్ వద్ద కడిపికొండ వాసులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని రాజీవ్ గృహకల్ప సముదాయం సమీపంలోని కల్వర్టు వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాల నివారణకు ఎల్లో కలర్ స్లో సిగ్నల్ రెండు లైట్లను ఏర్పాటు చేశారు. 44వ డివిజన్‌కు చెందిన కంకణాల సంపత్‌రెడ్డి రూ.25 వేల సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. ఇటీవల తనకు జరిగిన ప్రమాదం మరెవరికీ జరగకూడదనే సదుద్దేశంతో సిగ్నల్ లైట్ ఏర్పాటు చేసినట్లు సంపత్‌రెడ్డి తెలిపారు. కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు స్లో సిగ్నల్ లైట్‌ను ప్రారంభించిన సంపత్‌రెడ్డిని కడిపికొండకు చెందిన శనిగరం సమ్మయ్య, పంకర్ల కుమారస్వామి, ద్యాగల ఎల్లేష్, జంపయ్య, సత్యం తదితరులు అభినందించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా జులై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా పిలుపునిచ్చారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అల్లం అప్పయ్యను గురువారం కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో 78 రకాల కేడర్లలో పనిచేస్తున్న వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి మియాపురం గోవర్ధన్, యోగానంద చారి, పరికిరాల రమేష్, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బత్తుల విష్ణుమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆచంట అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీడీసీఎల్ డైరెక్టర్‌కు సన్మానం



తిరుపతి రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వంటేరు తిరుపతిరెడ్డిని దళిత బహుజన ఫ్రంట్ నాయకులు సన్మానించారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఫైనాన్స్ డైరెక్టర్, ఫైనాన్స్ సీజీఎంగా కొనసాగుతున్న తిరుపతి రెడ్డిని ప్రభుత్వం పూర్తిస్థాయి ఫైనాన్స్ డైరెక్టర్‌గా నియమించింది. ఈ సందర్భంగా హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో తిరుపతి రెడ్డిని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రాతు రమేష్ కుమార్, జాతీయ కమిటీ సభ్యుడు డీఎస్.ప్రభాకర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయాలి



ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, స్వామి, ఉపాధ్యాయులు

కాజీపేట రూరల్: ప్రభుత్వరంగ విద్యను విధ్వంసం చేసే విధానాలను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో శుక్రవారం జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని డీటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కటుకూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కాజీపేట దర్గా ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యారంగానికి కేంద్రం బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని, అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో 596 మండలాల్లో ఎంఈఓ పోస్టులు, 23 డీఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎన్ఎస్ఎం.స్వామి, ఉర్దూ మీడియం హెచ్‌ఎం ఎండీ.మక్బుల్ హుస్సేన్, పీఎస్ హెచ్‌ఎం రత్నాకుమారి, ఉపాధ్యాయులు సుమలత, సతీష్‌పాల్, సునీత, రాజు, సరోజ, శంశొద్దీన్, రాహుల్, వరలక్ష్మి, మునవర్ యాస్మిన్, శాద్మిన్‌ఖానో, విజయ, ధనలక్ష్మి, స్వర్ణ మేరీ, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



చిన్నారులను పరీక్షిస్తున్న మెడికల్ ఆఫీసర్ శ్రీదేవి



కాజీపేట: మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

కాజీపేట అర్బన్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని మెడికల్ ఆఫీసర్ శ్రీదేవి సూచించారు. కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న, సిబ్బంది కమల, లావణ్య, ఉపాధ్యాయులు మన్నె చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమిడిలో ఉచిత వైద్య శిబిరం

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో హ్యాండ్ ఆఫ్ హోప్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిస్టర్ నిర్మల, విచారణ గురువు బల్లా రాజ్, మేరీ, మాచర్ల జయాకర్, కుమ్మరి నీలక్క, రవికుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

శాస్త్రీయ ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలి



ఇంటరాక్షన్ కార్యక్రమంలో విద్యార్థులు

ఖిలా వరంగల్: విద్యార్థులు శాస్త్రీయ ప్రయోగాలపై అవగాహన పెంచుకోవాలని తాళ్ల పద్మావతి విద్యాసంస్థలు డైరెక్టర్లు వైష్ణవి, వరుణ్ సూచించారు. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లోని హిల్ క్రాఫ్ట్ పాఠశాల విద్యార్థులతో వరంగల్ హంటర్‌రోడ్డు ఉర్సుగుట్ట సమీపంలోని తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులు గురువారం ఆన్‌లైన్ వీడియో ద్వారా ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూకే విద్యార్థులతో అనేక అంశాలపై చర్చించి తమ అభిప్రాయాలను పంచుకున్నారు. వ్యవసాయ, వాతావరణ మార్పులు, వరదల ప్రభావం వంటి సమకాలీన అంశాలపై చర్చలు జరగడంతోపాటు రెండు పాఠశాలల విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టులను పరస్పరం పంచుకున్నారు. అనంతరం తాళ్ల పద్మావతి డైరెక్టర్లు వైష్ణవి, వరుణ్ మాట్లాడుతూ ఇంటరాక్షన్ ద్వారా విద్యార్థులు పరస్పరం నూతన విషయాలు తెలుసుకుని, విదేశీ మిత్రులతో మైత్రి బంధాలను ఏర్పర్చుకున్నారని వివరించారు.

హక్కుల పరిరక్షణలో ఓంకార్ పాత్ర మరువలేనిది



మాట్లాడుతున్న వల్లెపు ఉపేందర్ రెడ్డి

హన్మకొండ: పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పౌర హక్కుల పరిరక్షణలో మాజీ ఎమ్మెల్యే ఓంకార్ పాత్ర మరువలేనిదని ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి అన్నారు. ఓంకార్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా హనుమకొండ కిషన్‌పురలోని సిటీ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ఓంకార్.. ప్రజల గొంతుగా పని చేశారని కొనియాడారు. ముఖ్యంగా రైతు, విద్యార్థి, కార్మిక, కర్షక సమస్యలపై అసెంబ్లీలో, ప్రజాక్షేత్రంలో ధారళంగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తుచేశారు. రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛ, లౌకిక వాదాన్ని పాలకవర్గాలు కాలరాస్తున్నాయని తూర్పారబట్టారు. ఎంసీపీ(యూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎన్‌రెడ్డి హంసరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ వెంకటనారాయణ, ప్రొఫెసర్ మార్క శంకర్ నారాయణ, ప్రొఫెసర్ వీరస్వామి, ఆయా సంఘాలు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

11 ఏళ్ల మోదీ పాలనలో దేశాభివృద్ధి



అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్న రావుపద్మ

కాజీపేట అర్బన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. కాజీపేట మండలం న్యూశాయంపేట చౌరస్తాలో గురువారం ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మోదీ నేతృత్వంలో ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్, సర్జికల్, ఎయిర్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ వంటి సాహసోపేత కార్యక్రమాలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. నగర అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారని చెప్పారు. మరో 11 ఏళ్ల మోదీ నాయకత్వాన్ని బలపరిచేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నాయకులు నర్మెట శ్రీనివాస్, రత్నలక్ష్మి, సంద్ర మధు, నాను నాయక్, నిఖిల్ చోప్రా, జెండా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం చిత్తు



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న మేయర్ గుండు సుధారాణి, వరంగల్ కలెక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డీసీపీ అంకిత్‌కుమార్, అధికారులు



ర్యాలీ నిర్వహిస్తున్న వాగ్దేవి ఫార్మసీ కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్‌యాదవ్



వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తున్న కృష్ణా జూనియర్ కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కేఎంసీ వైద్య సిబ్బంది, ఎన్ఎస్ఎస్ కేడెట్లు



కేయూ లైబ్రరీ వద్ద మాదకద్రవ్యాల నివారణ వాల్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



హసన్‌పర్తి: అవగాహన ర్యాలీలో పాల్గొన్న సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి, విద్యార్థులు



మడికొండలో ర్యాలీలో విద్యార్థులు, పోలీసులు

సంక్షిప్తంగా

నేడు ఒకేషనల్ విద్యార్థులకు జాబ్‌మేళా

విద్యారణ్యపురి: ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సుల్లో 2022 – 2025 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్ చేసేందుకు ఈనెల 27న హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఉదయం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఐఈఓ గోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్ శ్రీధర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సాహూ మహారాజ్ స్ఫూర్తితో పోరాటం

హన్మకొండ: దేశానికి స్వాతంత్ర్యం రాకముందే పరాయి పాలనలో జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించిన ఛత్రపతి సాహూ మహారాజ్ స్ఫూర్తితో స్థానిక సంస్థలతో పాటు చట్టసభల్లో బీసీల వాటా సాధించడానికి పోరాటం చేయాలని ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ ఆధ్వర్యంలో సాహూ మహారాజ్ 151వ జయంతిని గురువారం జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి క్రాంతికుమార్, ప్రజా సంఘాల నాయకులు వీరస్వామి, ఓంకార్, కుమార్ గాడ్గే, లక్ష్మీనారాయణ, వెంకటచారి, మంజుల, అరుణ, సద్గుణ, ధనలక్ష్మి, సరోజన, సురేఖ, వరలక్ష్మి పాల్గొన్నారు.

పోస్టాఫీస్ సేవలను వినియోగించుకోవాలి

మడికొండ: పోస్టాఫీస్ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రమాదేవి తెలిపారు. మడికొండ పోస్టాఫీస్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోస్టాఫీస్ సేవలు మరింత సులభతరం అయ్యాయని వివరించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భిక్షపతి, స్థానిక పోస్ట్‌మాస్టర్ సత్తయ్య, బీపీఎం కిషన్, ఏబీపీఎంలు ఉదయ్, రమేష్, శ్రీదేవి, కోమల, తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ముదిరాజ్‌ల సమస్యలు

హన్మకొండ: ముదిరాజ్ కులస్తుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మత్స్య, పశు సంవర్థక, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ – తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గురువారం అందించారు. కార్యక్రమంలో మెపా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బోయిని జగన్మోహన్, గౌరవ సలహాదారు పులి ప్రభాకర్, నాయకులు పొన్నం రాజు, బొట్లపల్లి సంజీవన్ కుమార్, చిరుత వెంకటేశ్వర్లు, దండు చిరంజీవి, సింగారపు రామకృష్ణ, సీరటి రాజు పాల్గొన్నారు.

భవనానికి నిధులిచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

నయీంనగర్: మున్నూరుకాపు భవనానికి నిధులు వచ్చేలా చేసి, మున్నూరుకాపుల కల నెరవేర్చింది మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కరే అని 6వ డివిజన్ కార్పొరేటర్ చెన్నం మధు, మున్నూరుకాపు సంఘం నాయకుడు నీలం రాజ్‌కిశోర్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మున్నూరుకాపు సంఘం నాయకులు శ్రీధర్, సుహాస్, వరుణ్, అనిల్, నగేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థులకు అన్యాయం

హన్మకొండ: బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తోందని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ఆరోపించారు. సుబేదారిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకులు డాక్టర్ ఎర్రబొజ్జు రమేష్, సతీష్, సురేందర్ పాల్గొన్నారు.

30న రాష్ట్రస్థాయి కళాకారుల సదస్సు

ఖిలా వరంగల్: ఈనెల 30న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ భవనంలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కవులు, కళాకారుల సదస్సు నిర్వహించనున్నట్లు ప్రజా నాట్యమండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కేతరాజు ఉప్పలయ్య తెలిపారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో వరంగల్ జిల్లా కళాకారులు గన్నారపు రమేష్, దామెర కృష్ణ అధ్యక్షతన ప్రజానాట్య మండలి ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం జరిగింది.

కిరాణం షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్: అక్రమంగా గుట్కాలు విక్రయిస్తున్న కిరాణం షాపు వ్యాపారిపై కేసు నమోదు చేసి, అతడి వద్ద నుంచి రూ.1.61,850 విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. నిందితుడు విశ్వనాథంపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కేసును మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు సీఐ వివరించారు. దాడుల్లో ఆర్ఎస్సై భానుప్రకాశ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకల కరపత్రం ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: వచ్చే నెల 10వ తేదీన గురుపౌర్ణమి పురస్కరించుకొని నగరంలోని ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా మందిరంలో వారం రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలతో పాటు చిన్మయి మిషన్ వరంగల్ యజ్ఞానంద స్వామి ఆధ్వర్యంలో జులై 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జ్ఞానయజ్ఞ సప్తాహం నిర్వహించనున్నట్లు మందిర చైర్మన్ మతుకుమల్లి హరిగోపాల్ తెలిపారు. ఈ మేరకు మందిరం ఆవరణలో ధర్మకర్తలతో కలిసి కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు రాకం సదానందం, నిమ్మల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం

వరంగల్ చౌరస్తా: వరంగల్ అబ్బనికుంటలోని ప్లాటినం జూబ్లీ హైస్కూల్ (ఆగఖాన్ ఎడ్యుకేషన్ సర్వీస్ ఇండియా) 10(టీ) బీఎన్ ఎన్‌సీసీ కేడెట్లకు గురువారం 'ఎ' సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. న్యూస్ రిపోర్ట్‌లో భాగంగా టెన్ టీవీ ఏఓ రవి సునెహరే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీష్ పెచే, వైస్ ప్రిన్సిపాల్ ఉత్తమ్ చటర్జీ, ఎన్‌సీసీ ఆఫీసర్ నవీన్ సన్, సెక్షన్ హెడ్ ప్రసన్న బిదురు, అడ్మిన్ ఆఫీస్ మేనేజర్ సాంబమూర్తి, అన్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీసీసీ ఉపాధ్యక్షుడు సారయ్యకు సన్మానం

వరంగల్ చౌరస్తా: పీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను ఆయన స్వగృహంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు గురువారం సన్మానించారు. కార్పొరేటర్ నరేంద్ర కుమార్, నాయకులు లక్ష్మణ్, దామెర సర్వేషం, శ్రీమాన్, గోరంటల రాజు, దూపం సంపత్, బిల్లా శ్రీకాంత్, జన్ను రవి, కరాటే ప్రభాకర్ పాల్గొన్నారు.

ఫైనాన్షియల్ యాక్ట్‌ను రద్దు చేయాలి

నయీంనగర్: పెన్షనర్లకు నష్టం కలిగించే చట్టం ఫైనాన్షియల్ యాక్ట్ –2025ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ గిరి వీరన్న డిమాండ్ చేశారు.